సాక్షి
అనకాపల్లి
గురువారం । 13 । ఫిబ్రవరి । 2025


సముద్ర స్నానం అనంతరం బ్రహ్మముడులు వేయించుకుంటున్న దంపతులు


జంగమ దేవర పూజలు

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్‌గా కురసాల కన్నబాబు



సాక్షి, విశాఖపట్నం : వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్‌గా మాజీ మంత్రి కురసాల కన్నబాబు నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకం చేపట్టినట్లు కేంద్ర పార్టీ కార్యాలయం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

యువకుడిని కాపాడిన మెరైన్ పోలీసులు


పోలీసులు రక్షించిన ప్రకాష్

పాయకరావుపేట: మాఘ పౌర్ణమి సందర్భంగా సముద్ర స్నానానికి వెళ్లి, అలల తాకిడికి ఉక్కిరిబిక్కిరవుతున్న యువకుడిని మెరైన్ పోలీసులు రక్షించారు. పెదరాంభద్రపురానికి చెందిన కె.ప్రకాష్ తన స్నేహితులతో గజపతినగరం తీర ప్రాంతానికి స్నానానికి వెళ్లాడు. వీరు స్నానం చేస్తుండగా ప్రకాష్ అలల తాకిడికి సముద్రంలోనికి కొట్టుకుపోయాడు. తీరంలో వున్న గజ ఈతగాళ్లు, మెరైన్ పోలీసులు గమనించి యువకుడిని రక్షించారు. వైద్య సహాయం కోసం తుని తరలించామని, యువకుడు క్షేమంగా ఉన్నాడని మెరైన్ పోలీసు సిబ్బంది తెలిపారు.

దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమ శాఖ ఇన్‌చార్జి ఏడీగా కుమారస్వామి



అనకాపల్లి: జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు, హిజ్రాల సంక్షేమ శాఖ ఇన్‌చార్జ్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా కె.కుమారస్వామి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన అసిస్టెంట్ డైరెక్టర్ జి.వి.బి.జగదీష్ రెండు మాసాల క్రితం పర్యాటక శాఖ ప్రాంతీయ డివిజనల్ మేనేజర్‌గా విశాఖకు పదోన్నతిపై వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం కె.కుమారస్వామి మాట్లాడుతూ జిల్లాలో దివ్యాంగులు, వయోవృద్ధులు, హిజ్రాల సంక్షేమానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

సీఐఎస్‌ఎఫ్‌లో కానిస్టేబుల్ ఉద్యోగానికి దరఖాస్తులు

అనకాపల్లి: సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్సులో కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం మార్చి 4వ తేదీ వరకూ ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా వృత్తి నైపుణ్యాభివృద్ధి అధికారి (ఇన్‌చార్జ్) ఎస్.కె.మనోరమ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఐఎస్ఎఫ్‌లో కానిస్టేబుల్, డ్రైవర్ ఉద్యోగాలకు కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందని, మరిన్ని వివరాలకు https://cisfrectt.cisf.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఆమె కోరారు.

మూడు మాసాల్లో క్రిటికల్ కేర్ యూనిట్ అందుబాటులోకి..


ఎన్టీఆర్ ఆస్పత్రిలో వైద్యాధికారులతో కలెక్టర్ విజయ కృష్ణన్ సమావేశం

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రి సమీపంలో నిర్మాణంలో ఉన్న క్రిటికల్ కేర్ యూనిట్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. బుధవారం రాత్రి ఆస్పత్రి నిర్మాణ పనులను పరిశీలించి, వైద్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆస్పత్రిలో అన్ని రకాల వైద్యసేవలు అందించాలని, రోగులను ఇతర ఆస్పత్రులకు రిఫర్ చేయకుండా ఆస్పత్రిలో వైద్యసేవలు అందించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఆస్పత్రికి కావలసిన అన్నిరకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. క్రిటికల్ కేర్ యూనిట్‌ను మూడు మాసాల్లో పూర్తి చేసి రోగులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపడతామన్నారు. ఈ యూనిట్‌కు వైద్య సిబ్బంది ఎంతమంది కావాలన్న దానిపై ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. ఈ సమావేశంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎస్.శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వందే భారత్‌ల నిర్వహణ వైజాగ్‌లోనే.!

8లో

ఆధ్యాత్మిక తరంగాలు


రేవుపోలవరం తీరంలో పోటెత్తిన భక్తులు



బోటుపై నుంచి పర్యవేక్షిస్తున్న సీఐ గణేశ్

మాఘ పౌర్ణమి పుణ్య స్నానాలకు భక్తులు పోటెత్తారు. బుధవారం వేకువజాము నుంచే జిల్లాలోని సాగర తీరాలు కిటకిటలాడాయి. సముద్రంలో స్నానమాచరించి, దంపతులు బ్రహ్మముడులు వేయించుకున్నారు. పెద్దలకు తర్పణాలు వదిలారు. పురోహితులు, జంగమ దేవరలు వారితో పూజలు చేయించారు. భక్తులు సూర్యనమస్కారాలు చేసి, తీరంలో ఉన్న దేవాలయాల్లో పూజలు చేశారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. చెదురుమదురు ఘటనలు జరిగినా వెంటనే అప్రమత్తమైన పోలీసులు, గత ఈతగాళ్ల నీట మునిగిన వారిని రక్షించారు.

అచ్యుతాపురం/ఎస్.రాయవరం:

మాఘ పౌర్ణమిని ప్రజలు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. పుణ్యస్నానాలు చేసి, భక్తితో పూజలు చేశారు. పాయకరావుపేట, యలమంచిలి నియోజకవర్గాల్లోని సముద్ర తీర ప్రాంతాలు జన సందోహంతో నిండిపోయాయి. పూడిమడక, రేవుపోలవరంతోపాటు వాడపాలెం, రాజయ్యపేట, చందనాడ, బోయపాడు, బంగారయ్యపేట, పెంటకోట, పాల్మన్‌పేట తీరాలు కిక్కిరిసిపోయాయి. పూడిమడక తీరంలో మంగళవారం రాత్రంతా జాగరణలో దైవనామ స్మరణ, సాంస్కృతిక కార్యక్రమాల వీక్షణతో గడిపిన జనం తెల్లవారుజాము నుంచే స్నానాలు చేసి, జగన్నాథస్వామిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. బైనాక్యులర్స్ ద్వారా భక్తులను నిశితంగా పరిశీలించారు. డ్రోన్ కెమెరాల సాయంతో ఎక్కడి పరిస్థితులను అక్కడ పర్యవేక్షించారు. బోట్లలో సముద్రంలోకి వెళ్లిన పోలీసులు భక్తులు స్నానం ఆచరిస్తున్న తీరును పరిశీలించారు. తప్పిపోయిన ఇద్దరు చిన్నారుల్ని పోలీసులు వారి తల్లిదండ్రులకు అప్పగించారు. స్నానం ఆచరిస్తున్న భక్తునికి ఫిట్స్ రావడంతో ఒడ్డుకు తీసుకొచ్చి సపర్యలు చేశారు. వైద్య శిబిరం ఏర్పాటు చేసి భక్తులకు సేవలందించారు. మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేశారు.


పూడిమడక తీరంలో భక్తుల పుణ్యస్నానాలు

రేవుపోలవరంలో భక్తుల తాకిడి

రేవుపోలవరం తీరంలో పుణ్య స్నానమాచరించిన దంపతులకు బ్రహ్మముడులు వేసి, మరణించినవారికి తర్పణాలు వదిలి పురోహితులు పూజలు జరిపించారు. భక్తులు తీరం సమీపంలో పర్వతంపై వెలసిన శ్రీ లక్ష్మీమాధవస్వామి, దిగువన శ్రీ షిరిడీ సాయినాథుడిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. రాష్ట్ర హోం మంత్రి అనిత సముద్ర స్నానం చేసి లక్ష్మీమాధవస్వామిని దర్శించుకున్నారు. ఉదయం 9 గంటల ప్రాంతంలో అమాంతం ఒకేసారి భక్తుల తాకిడి పెరగడంతో తీరం కిక్కిరిసిపోయింది. అడ్డురోడ్డు నుంచి ప్రత్యేక బస్సులు నడిపారు. నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది కంట్రోల్ రూమ్ నుంచి ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేస్తూ, తప్పిపోయిన వారిని అప్పగించే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.


తప్పిపోయిన బాలుడ్ని అప్పగించిన పోలీసులు, (మధ్య) బాలుడితో తండ్రి


లక్ష్మీమాధవ స్వామి ఆలయాన్ని దర్శిస్తున్న భక్తులు

యువతి మౌన పోరాటం

- ప్రేమించి పెళ్లాడి ముఖం చాటేశాడని భర్తపై ఆరోపణ
- అత్తవారింటి వద్ద ధర్నా

కె.కోటపాడు: ప్రేమించి పెళ్లి చేసుకున్న తరువాత తల్లిదండ్రులకు ఇష్టం లేదన్న నెపంతో ముఖం చాటేసిన భర్త గుదే సురేష్ వైఖరికి నిరసనగా స్వాతి అత్తవారింటి వద్ద మౌన పోరాటానికి దిగింది. పదేళ్ల ప్రేమకు ఫలితం ఇదేనా అని ఆమె భర్తను ఆవేదనగా ప్రశ్నిస్తోంది. ఈ సందర్భంగా స్వాతి మాట్లాడుతూ.. మధురవాడ ప్రాంతానికి చెందిన తాను, రొంగలినాయుడుపాలెం గ్రామానికి చెందిన సురేష్ విశాఖపట్నం కృష్ణా కళాశాలలో కలిసి చదువుకున్నామని, 2013 నుంచి తమకు పరిచయం ఉందని తెలిపింది. తనను ప్రేమిస్తున్నట్లు సురేష్ తెలపడంతో ఇద్దరం ఇష్టపడినట్లు పేర్కొంది. గత ఏడాది అక్టోబర్ 9న మధురవాడలో రిజిస్టర్డ్ పెళ్లి చేసుకున్నామని, అదే ప్రాంతంలో అద్దె ఇంటిలో కాపురం సాగించామని ఆమె తెలిపింది. తన తల్లిదండ్రులకు ఈ వివాహం ఇష్టం లేదంటూ సురేష్ తమ ఇంటికి గత ఏడాది డిసెంబర్ నుంచి రావడం లేదని ఆమె పేర్కొంది. దీంతో కె.కోటపాడు మండలం రొంగలినాయుడుపాలెంలో గ్రామ పెద్దలకు సురేష్‌తో జరిగిన వివాహం గురించి తెలిపి ఇద్దరినీ ఒక్కటి చేయాలని కోరినట్టు స్వాతి తెలిపింది. భర్త నుంచి తనను వేరు చేసి తన జీవితాన్ని అన్యాయం చేయవద్దని ఆమె కోరింది. బాధితురాలికి న్యాయం జరిగేంత వరకూ పోరాటం చేయనున్నట్లు విశాఖపట్నం, కె.కోటపాడు సీఐటీయూ నాయకులు పి.రాజ్‌కుమార్, ఎర్రా దేముడు, గండి నాయుడుబాబు చెప్పారు.


అత్తవారింటి వద్ద బంధువులు, సీఐటీయూ నాయకులతో ధర్నా చేస్తున్న స్వాతి


స్వాతి, సురేష్‌ల పెళ్లి నాటి ఫొటో (ఫైల్)

ప్రసూతి మరణాలను సహించను

- ఒక్క బాలింత, శిశువు కన్నుమూసినా క్రిమినల్ చర్యలు
- సమీక్ష సమావేశంలో కలెక్టర్ విజయ కృష్ణన్ హెచ్చరిక


సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

అనకాపల్లి: జిల్లాలో ఒక్క బాలింత, శిశు మరణం సంభవించినా, ప్రసూతి కేసులను ఇతర ఆస్పత్రులకు రిఫర్ చేసినా సంబంధిత అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటానని కలెక్టర్ విజయ కృష్ణన్ హెచ్చరించారు. జిల్లా, డివిజన్, మండల స్థాయి ప్రసూతి, శిశుమరణాల కమిటీ సమావేశం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం జరిగింది. జూలై నుంచి డిసెంబర్ వరకు సంభవించిన బాలింతలు, నవజాత శిశు మరణాలపై సమీక్షించి, అందుకు గల కారణాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఒక్క ప్రసూతి, శిశు మరణం కూడా సంభవించడానికి వీల్లేదని, సిబ్బంది నిర్లక్ష్యంగా ఉండరాదని, మరణాల తర్వాత సమీక్షించడం కంటే అవి జరగకుండా అరికట్టడమే అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు. క్షేత్ర స్థాయిలో ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు, అంగన్‌వాడీలు ఉండి కూడా ఎందుకిలా జరుగుతోందని, మరణాలలో 90 శాతం అరికట్టదగినవేనని అన్నారు. ఇక నుంచి నిర్లక్ష్యం వహించిన సంబంధిత అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవడానికి కూడా వెనుకాడబోనని కలెక్టర్ విజయ కృష్ణన్ హెచ్చరించారు.

ఏటీఎం కార్డు కాజేసి మహిళకు టోకరా

రూ.30 వేలు డ్రా చేసిన మోసగాడు


ఏటీఎంలో బాధితురాలికి సహాయపడుతున్నట్టు నటిస్తున్న మోసగాడు (సీసీ కెమెరా ఫుటేజ)

నర్సీపట్నం: నమ్మించి ఏటీఎంలో నగదు కాజేసిన ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. పట్టణానికి చెందిన ఫాతిమా తన తల్లి ఆపరేషన్ నిమిత్తం అప్పు చేసి, నగదు డ్రా చేసేందుకు ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఉన్న ఏటీఎంకు ఈనెల 11న వెళ్లింది. ఏటీఎంలో జనం ఎక్కువ మంది ఉండడంతో ఆమె వరుసలో నిలుచుంది. అప్పటికే ఏటీఎంలో మాటువేసిన మోసగాడు నగదు డ్రా చేస్తున్న వారిని గమనిస్తున్నాడు. ఫాతిమాతో మాట కలిపాడు. ఆమె ఏటీఎం నుంచి రూ.10 వేలు నగదు డ్రా చేసింది. నగదు డ్రా చేయడంలో ఆమెకు సహాయపడినట్టు నటించిన మోసగాడు పిన్ నంబరు గుర్తు పెట్టుకున్నాడు. వేరే కార్డు ఆమెకు ఇచ్చేసి, ఆమె కార్డు కాజేశాడు. ఆమె ఖాతా నుంచి మొదటిగా రూ.10 వేలు, పెట్రోల్ బంకులో కార్డు స్వైపింగ్ ద్వారా రూ.20 వేలు కాజేశాడు. తన తల్లి ఆపరేషన్ నిమిత్తం రూ.1.6 లక్షలు అప్పు చేశానని, కార్డు మార్చేసిన మోసగాడు తన ఖాతా నుంచి రూ.30 వేలు కాజేశాడని బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు టౌన్ ఎస్సై రమేష్ కేసు నమోదు చేశారు. ఏటీఎంలోని సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా నిందితుడి కోసం గాలిస్తున్నామని ఎస్సై రమేష్ తెలిపారు.

బర్డ్ ఫ్లూ భయం..!



- జిల్లాలో భారీగా తగ్గిన చికెన్ విక్రయాలు
- పొరుగు జిల్లాల్లో బర్డ్ ఫ్లూ వార్తలతో కొనుగోలుకు అనాసక్తి
- భారీగా పడిపోయిన చికెన్ ధర
- లబోదిబోమంటున్న పౌల్ట్రీ నిర్వాహకులు

సాక్షి, అనకాపల్లి: బర్డ్ ఫ్లూ కలకలం రేపుతోంది. చికెన్ ప్రియులు ముక్క ముట్టాలంటే భయపడిపోతున్నారు. ఇటీవల ఉభయ గోదావరి జిల్లాల్లో సంభవించిన కోళ్ల మరణాలకు కారణం బర్డ్ ఫ్లూ అని నిర్ధారణ కావడంతో అనకాపల్లి జిల్లాలోని కోడిమాంస ప్రియులు ఒకింత కలవరపాటుకు గురవుతున్నారు. దీంతో చికెన్ విక్రయాలు గణనీయంగా పడిపోయాయి. జిల్లాలో బర్డ్ ఫ్లూ ప్రభావం లేకపోయినప్పటికీ.. తినేందుకు భయపడుతున్నారు. అయితే పశుసంవర్ధశాఖ అధికారులు మాత్రం బర్డ్‌ఫ్లూ వైరస్ ప్రభావం జిల్లాలో లేదని, ఈ వైరస్ 70 డిగ్రీల సెంటీగ్రేడ్, అంతకన్నా ఎక్కువ వేడి దగ్గర బతకలేదని.. మనం వంద డిగ్రీల సెంటీగ్రేడ్ కంటే ఎక్కువ ఉష్ణోగ్రతల వద్ద చికెన్ ఉడికిస్తామని.. అందువల్ల ఎలాంటి ప్రభావం, ప్రమాదం లేదని వివరిస్తున్నారు. ప్రజలు చికెన్‌ను బాగా ఉడికించి తింటే ఎలాంటి ప్రమాదం ఉండదని స్పష్టం చేస్తున్నారు. జిల్లాలో రోజుకు సగటున 83 మెట్రిక్ టన్నుల చికెన్ విక్రయాలు జరిగేవి. వారం రోజుల నుంచి 30 మెట్రిక్ టన్నులు కూడా అమ్ముడుపోవడంలేదు. ఇదే పరిస్థితి కొనసాగితే తమ దుకాణాలు మూసుకోవాలని వ్యాపారస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో పౌల్ట్రీ పరిశ్రమలు	203
వీటిలో లేయర్ ఫారాలు	27
బ్రాయిలర్ ఫారాలు	176


రాపిడ్ రెస్పాన్స్ టీంలతో అవగాహన

జిల్లాలో గత రెండు రోజుల నుంచి ప్రతి మండలంలో రెండు రాపిడ్ రెస్పాన్స్ టీంలను ఏర్పాటు చేసి పౌల్ట్రీ ఫారంలలో అవగాహన కల్పిస్తున్నారు. ఒక్కో రాపిడ్ టీంలో ఒక వెటర్నరీ డాక్టర్, ఇద్దరు సహాయక సిబ్బంది ఉంటారు. జిల్లాలో మొత్తం 44 బృందాలను ఏర్పాటు చేశారు. పౌల్ట్రీ ఫారంలో నాలుగు కోళ్ల కన్నా ఎక్కువగా చనిపోతే వాటి శాంపిల్స్ సేకరించి పూనేకు పంపిస్తున్నారు. అంతేకాకుండా చనిపోయిన కోళ్లను మూడు లేదా నాలుగు అడుగుల లోతు గుంతలో పూడ్చేలా అవగాహన కల్పిస్తున్నారు. ముందస్తు సమాచారం వస్తే శాంపిల్స్ సేకరించి వాటిని పరీక్షకు పంపించి వ్యాధి నిర్ధారణ చేసుకునే అవకాశం ఉంటుంది. బయో సెక్యూరిటీ నియమాలు పాటించాలంటూ అధికారులు ఆదేశాలు ఇస్తున్నారు.

ముక్క ముట్టాలంటే భయం..

జిల్లాలో 203 పౌల్ట్రీ పరిశ్రమలున్నాయి. ఏడాదికి 33.66 లక్షల కోళ్ల ఉత్పత్తి అవుతున్నాయి. ఇందులో 60 శాతం ఎగుమతి అవ్వగా.. 40 శాతం మేర జిల్లాకు సరఫరా అవుతున్నాయి. గత రెండు రోజుల నుంచి చికెన్ విక్రయాలు 50 శాతానికి పైగా పడిపోయాయి. దీంతో రూ.250లు ఉన్న కేజీ చికెన్ ధర రూ.180–రూ.190లకు పడిపోయింది.

జిల్లాలో ప్రభావం లేదు..



జిల్లాలో ఇప్పటివరకూ ఒక్క బర్డ్ ఫ్లూ కేసు కూడా నమోదు కాలేదు. కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశాల మేరకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. ఆర్ఆర్ టీంలతో ముందస్తు పర్యవేక్షణ ఏర్పాటు చేశాం. జిల్లాలో బర్డ్‌ఫ్లూపై తీసుకునే చర్యలు, ప్రభావం వంటి వాటిపై ప్రతిరోజు జిల్లా ఉన్నతాధికారులకు రిపోర్టు సబ్మిట్ చేస్తున్నాం. బర్డ్ ఫ్లూ వైరస్ 70 డిగ్రీల సెంటిగ్రేడ్ వేడి వరకే బతుకుతుంది. మనం వంద డిగ్రీల సెంటిగ్రేడ్ కంటే ఎక్కువ ఉష్ణోగ్రతల వద్ద చికెన్ ఉడికిస్తాం. అందువల్ల ఎటువంటి ప్రమాదం ఉండదు. అయితే ఈ వైరస్ గాలి ద్వారా వ్యాప్తి చెందుతుంది. వలస పక్షుల కారణంగా వ్యాపిస్తుంది. ఇటీవల ఉభయ గోదావరి జిల్లా ల్లోని పలు ప్రాంతాల్లో చనిపోయిన కోళ్ల శాంపిల్స్‌ను మధ్యప్రదేశ్‌లోని భోపాల్ నేషనల్ ల్యాబ్‌కు పంపించగా.. బర్డ్ ఫ్లూ పాజిటివ్ వచ్చింది. దీంతో మన జిల్లాలో కూడా అప్రమత్తం చేస్తున్నాం.

– డాక్టర్ రామ్మోహన్‌రావు, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి

గతంలో రోజుకు చికెన్ విక్రయాలు సగటున **83** మెట్రిక్ టన్నులు

వారం రోజుల నుంచి.. **30** మెట్రిక్ టన్నులు దాటని దుస్థితి

క్లుప్తంగా

క్రికెట్ టోర్నీ విజేత విశాఖ



విజేతలకు నగదు బహుమతి అందజేస్తున్న సర్పంచ్, కమిటీ సభ్యులు

మాకవరపాలెం : బూరుగుపాలెంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో విశాఖపట్నం జట్టు ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. ఈ గ్రామంలో పరిదేశమ్మ పండగ సందర్భంగా గత నెల 26 నుంచి క్రికెట్ పోటీలు ప్రారంభించారు. సర్పంచ్ వొబ్బలరెడ్డి వెంకటరమణ, మాజీ ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, ఎంపీటీసీ రుత్తల యర్రాపాత్రుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ టోర్నమెంట్‌లో విశాఖ జట్టు ప్రథమ, బూరుగుపాలెం జట్టు ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నాయి. మంగళవారం రాత్రి విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రథమ రూ.40,000, ద్వితీయ రూ.20,000 నగదును సర్పంచ్ వొబ్బలరెడ్డి వెంకటరమణ, కమిటీ సభ్యులు పంపిణీ చేశారు.

రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో పతకాలు



మెడల్స్ అందుకుంటున్న బాక్సింగ్ క్రీడాకారులు

నర్సీపట్నం : ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశాఖ రైల్వే స్టేడియంలో ఈ నెల 11,12 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి మహిళా బాక్సింగ్ చాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో నర్సీపట్నం బాక్సింగ్ అకాడమీ క్రీడాకారులు ఏడు పతకాలు సాధించారు. బొగ్గ మౌనిక(75) కిలోలు, వడ్డాది నళిని(80)కిలోల విభాగంలో గోల్డ్ మెడల్స్ సాధించారు. ఎల్.సమంత 60 కిలోల విభాగంలో రజత పతకం, సిహెచ్.రోహిణి(80), కె.కృష్ణవేణి(70), కె.తేజస్విని(80) కాంస్య పతకాలు సాధించారు. వై.తేజస్విని 78 కిలోల విభాగంలో కాంస్య పతకంతో పాటు లూసర్ అవార్డ్ దక్కించుకుందని శాప్ కోచ్ కె.అబ్బు తెలిపారు. ద్రోణాచార్య అవార్డీ వెంకటేశ్వరరావు, అనకాపల్లి జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు, రైల్వేస్ కార్యదర్శి రెడ్డి శ్రీనివాస్, ఏపీ బాక్సింగ్ కార్యదర్శి లక్ష్మణ్‌దేవ్ విజేతలకు పతకాలు అందించి అభినందించారు.

ఐవోసీలో ఉద్యోగాలకు గడువు ఈనెల 23

అనకాపల్లి టౌన్: ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ జూనియర్ ఆపరేటర్ పోస్టులు 215, జూనియర్ అటెండెంట్ పోస్టులు 23, జూనియర్ అటెండర్ గ్రేడ్ 1 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసిందని జిల్లా వృత్తి నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అధికారి (ఇన్‌చార్జ్) ఎస్.కె.మనోరమ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పై పోస్టులలో దివ్యాంగులకు ప్రత్యేక రిజర్వేషన్ సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. ఈ నెల 23వ తేదీలోగా నిరుద్యోగ యువతీ, యువకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9990601187 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

వందే భారత్‌ల నిర్వహణ వైజాగ్‌లోనే..!

దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుకు అడుగులు పడుతున్న నేపథ్యంలో.. విశాఖ డివిజన్‌లో కొత్త ప్రాజెక్టులపై రైల్వే బోర్డు సన్నద్ధమవుతోంది. ఏడాదిన్నర క్రితం మంజూరైన ప్రాజెక్టులకు మోక్షం కలుగుతోంది. వందేభారత్ రైళ్ల సర్వీసులు పెరుగుతున్న నేపథ్యంలో నిర్వహణ డిపోలు దేశ వ్యాప్తంగా ఏర్పాటు చేస్తోంది. ఇందులోభాగంగా విశాఖలోనూ ఓ మెయింటెనెన్స్ డిపో కూడా రాబోతోంది. రూ.500 కోట్లతో షెడ్‌ల నిర్మాణానికి అనువైన స్థలం గుర్తించారు. రైల్వే పరేడ్ గ్రౌండ్‌ని ఎంపిక చేశారు. త్వరలోనే డీపీఆర్ సిద్ధం చేసేందుకు డివిజన్ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.

- కొత్త జోన్ ఏర్పాటు నేపథ్యంలో రైల్వే బోర్డు చకచకా అడుగులు
- ఏడాదిన్నర క్రితం మంజూరైన ప్రాజెక్టుకు స్థలం ఎంపిక దాదాపు పూర్తి
- రైల్వే గ్రౌండ్‌లో రూ.500 కోట్లతో మెయింటెనెన్స్ షెడ్ నిర్మాణం
- త్వరలోనే డీపీఆర్ సిద్ధం చేయనున్న డివిజన్ అధికారులు



వందేభారత్ మెయింటెనెన్స్ డిపో రానుంది ఈ మైదానంలోనే.. (ఇన్‌సెట్) వందేభారత్ రైళ్లు

సాక్షి, విశాఖపట్నం : భారతీయ రైల్వే వ్యవస్థలో పెను మార్పులు తీసుకొచ్చిన వందే భారత్ రైలు.. అన్ని చోట్లా అద్భుతంగా దూసుకుపోతోంది. అన్ని సదుపాయాలతో వేగవంతమైన ప్రయాణాన్ని అందిస్తున్న వందే భారత్ రైళ్లకు క్రమంగా డిమాండ్ పెరుగుతోంది. విశాఖ నుంచి ప్రస్తుతం సికింద్రాబాద్, దుర్గ్‌కు సర్వీసులు నడుస్తున్నాయి. త్వరలోనే తిరుపతికి కూడా వందేభారత్ వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ రాబోతున్న నేపథ్యంలో ఇక్కడి నుంచి వందేభారత్ సర్వీసులు మరిన్ని పెరగనున్నాయి. అందుకే విశాఖలో ఈ రైళ్ల నిర్వహణ కోసం మెయింటెనెన్స్ డిపో ఏర్పాటు చేయాలని రైల్వే బోర్డు భావిస్తోంది. ఏడాదిన్నర క్రితం వందేభారత్ మెయింటెనెన్స్ డిపో వైజాగ్‌లో నిర్మించాలన్న ప్రతిపాదనలు వచ్చాయి. ఆ తర్వాత అధికారులు దీనిపై సమీక్ష నిర్వహించారు. ఇప్పుడు జోన్ ప్రక్రియ వేగవంతం కావడంతో మరోసారి ప్రాజెక్టు తెరపైకి వచ్చింది.

రైల్వే పరేడ్ గ్రౌండ్ అనుకూలం

మెయింటెనెన్స్ డిపో ఏర్పాటుకు అప్పట్లో స్థల పరిశీలన చేశారు. రైల్ ట్రాక్ కనెక్టివిటీ ఉన్న ఖాళీ స్థలాల్ని అధికారులు పరిశీలించారు. తొలుత వడ్లపూడిలోని వ్యాగన్ వర్క్‌షాప్ పక్కన నిర్మించాలని భావించారు. అయితే రైలు విశాఖ స్టేషన్ నుంచి అక్కడికి వెళ్లి తిరిగి వచ్చేందుకు చాలా సమయం పడుతుంది. అదే సమయంలో స్టేషన్‌కు రావాలంటే అవుటర్‌లో ఖాళీ లేకపోతే.. గంటల తరబడి వేచి ఉండాలి. దీంతో నిర్దిష్ట సమయానికి కొన్ని సార్లు నడపడం వీలవదు. ఈ సమస్యల్ని దృష్టిలో పెట్టుకొని విశాఖ రైల్వే స్టేషన్‌కు సమీపంలోనే దీన్ని నిర్మించాలని భావించారు. ఇందుకోసం. రైల్వే పరేడ్ గ్రౌండ్‌ను సూత్రప్రాయంగా ఎంపిక చేశారు. విశాఖ రైల్వే స్టేషన్‌కు అర కిలోమీటర్ దూరంలో ఈ గ్రౌండ్ ఉంది. వాల్తేరు రైల్వే డివిజన్ స్వాతంత్య్ర, గణతంత్ర దినోత్సవాలు, ఇతర క్రీడాపోటీలు, ఎగ్జిబిషన్లకు ఈ గ్రౌండ్‌ను వినియోగిస్తున్నారు. సుమారు 6 ఎకరాల విస్తీర్ణం ఉన్న ఈ గ్రౌండ్‌కు వెనుక వైపు పిట్‌లైన్ మాదిరిగా రైల్ ట్రాక్ ఉంది. డిపో నిర్మాణ సమయంలో ఈ పిట్‌లైన్‌కు ట్రాక్‌లను అనుసంధానం చేస్తే పని సులువవుతుంది. అందుకే రైల్వే గ్రౌండ్‌ని మెయింటెనెన్స్ డిపో నిర్మాణ స్థలంగా ఎంపిక చేశారు. ఇప్పటికే రూ.500 కోట్లు మంజూరయ్యాయని అధికారులు చెబుతున్నారు. త్వరలోనే డీపీఆర్ సిద్ధం చేసి అనుమతుల కోసం రైల్వే బోర్డుకు పంపించనున్నట్లు వాల్తేరు డివిజన్ అధికారులు వెల్లడించారు.

వందే భారత్ నెట్‌వర్క్ బలోపేతమయ్యేలా...

వందేభారత్ రైళ్ల కోసం మెయింటెనెన్స్ డిపోలు దేశ వ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా దక్షిణ కోస్తా జోన్ పరిధిలోని విశాఖ డివిజన్‌లో ఓ డిపో ఏర్పాటు కానుంది. ఈ డిపోలో వందేభారత్ రైళ్లను నిలిపి ఉంచుతారు. ఈ రైళ్లలో ఇన్‌స్పెక్షన్ అండ్ మెయింటెనెన్స్ టేబుల్స్ నిర్వహిస్తారు. ఈ టేబుల్స్‌లో పర్‌ఫార్మెన్స్ టెస్ట్‌లు, ప్రివెంటివ్ మెయింటెనెన్స్ ప్రొసీజర్‌ల వివరాలు ఉంటాయి. వందేభారత్ రైళ్ల కోసం ట్రాక్షన్, ప్రధాన ఎలక్ట్రికల్ ఎక్విప్‌మెంట్‌లకు ప్రివెంటివ్, కరెక్టివ్ మెయింటెనెన్స్‌ను అందించేందుకు ఏర్పాట్లు చేయనున్నారు. ఇక్కడ రాబోతున్న డిపోలో రన్నింగ్ మెయింటెనెన్స్ బేలో ట్రిప్ షెడ్యూల్‌లు లేదా వీక్లీ షెడ్యూల్‌లు వంటి కార్యాచరణ నిర్వహణ కోసం సౌకర్యాలు కల్పిస్తారు. ఇందులో అండర్ గేర్, ఓవర్ హెడ్ పరికరాలు, ఇంటీరియర్‌లను తనిఖీ చేయడం, వాషింగ్, క్లీనింగ్, బ్రేక్ సిస్టమ్‌లు, డ్రాఫ్ట్ గేర్ (కప్లర్లు), ఎయిర్ కండిషనింగ్, ఇతర ఎలక్ట్రికల్, మెకానికల్ సబ్‌సిస్టమ్‌ల మరమ్మతులు నిర్వహించే అవకాశం ఉంది. ఒకేసారి 5 నుంచి 10 వందేభారత్ రైళ్లను ఇక్కడ మెయింటెనెన్స్ చేసేలా నిర్మాణం ఉండబోతుందని వాల్తేరు వర్గాలు చెబుతున్నాయి.

ఉత్సాహంగా జిల్లా స్థాయి గుర్రాల పోటీలు



పోటీలలో దౌడు తీస్తున్న గుర్రం

నాతవరం : లింగంపేట గ్రామంలో బుధవారం జిల్లా స్థాయి గుర్రపు పోటీలు ఉత్సాహంగా జరిగాయి. గ్రామంలో శ్రీమహాలక్ష్మి అమ్మవారు పండగ సందర్భంగా దేవాడ దొరబాబు ఆధ్వర్యంలో పోటీలు ఏర్పాటు చేశారు. వివిధ మండలాలకు చెందిన 15 గుర్రాలు పాల్గొన్నాయి. పోటీల్లో ప్రథమ విజేతగా కోటవురట్ల మండలం రామన్నపాలెం గ్రామానికి చెందిన గుర్రం నిలిచింది. రెండో స్థానం కోటనందూరు మండలానికి చెందిన గుర్రం దక్కించుకుంది. ఈ పోటీలలో గెలిచిన గుర్రాలకు ప్రథమ బహుమతి రూ. 15వేలు, రెండో బహుమతి రూ.12వేలు, మూడో బహుమతి రూ.10వేలు నగదుతో పాటు షీల్డు అందజేశారు. పోటీలకు నాతవరం గ్రామానికి చెందిన అంకంరెడ్డి లచ్చబాబు లక్ష రూపాయలు విరాళంగా ఇచ్చారు. ఈ పోటీలను స్థానిక గ్రామపెద్ద దేవాడ దొరబాబుతో కలిసి టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ ప్రారంభించారు. నాతవరం ఎస్ఐ భీమరాజు బందోబస్తు ఏర్పాటు చేశారు. మాజీ ఎంపీపీ సన్యాసిదేముడు, నాతవరం మాజీ సర్పంచ్ శెట్టి శ్రీను, మండల నాయకులు శెట్టి లోవ, రంభా సత్యనారాయణ, నేతల విజయ్‌కుమార్, బెన్నయ్య నాయుడు పాల్గొన్నారు.

రైతు రిజిస్ట్రీలో వివరాలు నమోదు చేసుకోండి

- జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహనరావు

సబ్బవరం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు రిజిస్ట్రీలో రైతుల వివరాలను త్వరితగతిన నమోదు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహనరావు తెలిపారు. మండలంలోని బంగారమ్మపాలెం గ్రామ సచివాలయంలో జరుగుతున్న రైతు నమోదు కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. కేంద్రం ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమంలో రైతులందరూ తమ పేర్లను నమోదు చేసుకుంటే ఆధార్ తరహాలో 11 నంబర్లతో కూడిన ఓ యూనిక్ ఐడీని కేటాయించనున్నట్లు తెలిపారు. దీంతో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే పీఎం కిసాన్ భరోసా, రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందించే సంక్షేమ పథకాలు పొందడం సులభమవుతుందన్నారు.



రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి మోహనరావు

అన్ని గ్రామాల రైతులు ఇందులో తమ పేర్లను నమోదు చేసుకునేలా గ్రామ వ్యవసాయ సహాయకులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొన్ని గ్రామాల్లో తలెత్తుతున్న సాంకేతిక లోపాలను త్వరితగతిన సరిచేస్తామన్నారు. కార్యక్రమంలో బంగారమ్మపాలెం సర్పంచ్ దాడి లావణ్య, గ్రామ వ్యవసాయ సహాయకులు బొబ్బరి లావణ్యతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

మద్యం ధరలు తగ్గించకుంటే ఆందోళన తప్పదు

- మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఇంటింటికీ సంక్షేమ పథకాలు
- నేడు కూటమి హయాంలో విచ్చలవిడిగా బెల్ట్‌షాపులు
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

మునగపాక : ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం తుంగలోకి తొక్కుతుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ విమర్శించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సూపర్ సిక్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలను గాలి కొదిలేసిందన్నారు. ప్రధానంగా మద్యం ధరలు తగ్గిస్తామంటూ గొప్పలు చెప్పి తీరా అధికారంలోకి వచ్చాక మద్యం ధరలను పెంచడం అన్యాయమన్నారు. దీనికి తోడు గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తూ అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారన్నారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో వలంటీర్ల ద్వారా ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందజేస్తే కూటమి ప్రభుత్వం మాత్రం మద్యాన్ని విచ్చలవిడిగా డోర్ డెలివరీకి అందించేలా శ్రీకారం చుట్టిందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలన సువర్ణయుగంగా నడిచిందన్నారు. ప్రజలకు జగన్‌మోహన్‌రెడ్డి భరోసాగా నిలిచేవారన్నారు. కానీ కూటమి ప్రభుత్వం మాత్రం పేదలకు సంక్షేమ పథకాలు ఇవ్వకుండా ప్రజలపై మరింత భారం పెరిగేలా ధరలను పెంచుతుందన్నారు. ప్రధానంగా మద్యం ధరల విషయంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లోపించిందన్నారు. గ్రామాల్లో బెల్ట్‌షాపులు విచ్చలవిడిగా నిర్వహిస్తున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరించడం విచారకరమన్నారు. తక్షణమే పెంచిన మద్యం ధరలను తగ్గించాలని లేకుంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ నేతలు నరాలశెట్టి సూర్యనారాయణ, పిన్నమరాజు రవీంద్రరాజు, ఆడారి రమణబాబు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలకు సత్వర సేవలు అందాలి

- ఆస్పత్రులు తనిఖీ చేసిన కేంద్ర వైద్య బృందం

అనకాపల్లి: గర్భిణులు, బాలింతలకు సకాలంలో వైద్యసేవలు అందించాలని కేంద్ర వైద్య బృందం ప్రతినిధి డాక్టర్ డిఆర్.వరుణ్ విజయ్ అన్నారు. స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రి, మండలంలో తుమ్మపాల, తగరంపూడి పీహెచ్‌సీలలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర వైద్యశాఖకు అందజేస్తున్న గర్భిణుల విభాగం, రక్త పరీక్షల విభాగాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు కేంద్ర ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తుందని, వాటిని గ్రామాల్లో ఉన్న ఆశ వర్కర్స్, అంగవాడీ ఉద్యోగులు సకాలంలో అందించే విధంగా చూడాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ ఆస్పత్రుల్లో రక్త పరీక్షలకు రాష్ట్ర ప్రభుత్వానికి కొంత నిధులు కేటాయిస్తుందని, వాటిని సకాలంలో వినియోగించుకోవాలన్నారు. అంతకు ముందు ఆస్పత్రుల్లో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ ఎస్.శ్రీనివాసరావు, జిల్లా మలేరియా అధికారి కె.వరహాలుదొర, జిల్లా గణాంక అధికారి రామచంద్రరావు, జిల్లా ప్రొగ్రాం అధికారి జగదీష్, తుమ్మపాల పీహెచ్‌సీ వైద్య అధికారి షేక్ నజరత్ సమీమ్, తగరంపూడి వైద్యురాలు పావని పాల్గొన్నారు.



తుమ్మపాల పీహెచ్‌సీలో మందుల వివరాలను పరిశీలిస్తున్న కేంద్ర వైద్య బృందం ప్రతినిధి డాక్టర్ వరుణ్ విజయ్



కె. కోటపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ల్యాబ్‌ను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

కె.కోటపాడు సీహెచ్‌సీ సందర్శన

కె. కోటపాడు: జాతీయ ఆరోగ్య మిషన్ కేంద్ర బృందం సభ్యులు బుధవారం గ్రామాల్లో పర్యటించారు. మండల కేంద్రంలో సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి, వైద్యులు, సిబ్బందితో సమావేశమయ్యారు. కేంద్ర బృందం సభ్యులు జి. వరుణ్ విజయ, జె. ప్రశాంత్, బి.లూసి సారధ్యంలో బృందం సభ్యులు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, ఆస్పత్రిలో జరుగుతున్న ప్రసవాలు గురించి ఆరా తీశారు. మలేరియా, డెంగ్యూ, కుష్ఠు, వ్యాధి, వాటి నివారణ చర్యలు గురించి సమీక్షించారు. గర్భిణులకు అందిస్తున్న సేవలు, చిన్నారులకు అందిస్తున్న వ్యాక్సిన్ వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు.

వీరి వెంట డీఎంవో కె.వరహాలుదొర, డీసీఓ జగదీశ్, రామచంద్రరావు, చోడవరం మలేరియా సబ్‌యూనిట్ అధికారి రమణ,సీహెచ్‌సీ వైద్యులు కార్యక్రమములో పాల్గొన్నారు. అనంతరం బృందం సభ్యులు కింతాడ హెల్త్ వెల్‌నెస్ సెంటరును పరిశీలించారు.

ఉత్సాహంగా తాండవ గిరి ప్రదక్షిణ



తాండవలో గిరిప్రదక్షిణ చేస్తున్న భక్తులు



శ్రీనల్లగొండమ్మ తల్లి ఆలయంలో భక్తులు

నాతవరం : నల్లగొండమ్మ తల్లి ఆలయం కొండ చుట్టూ బుధవారం భక్తిశ్రద్ధలతో భక్తులు గిరి ప్రదక్షిణలు చేశారు. తాండవ గ్రామంలో వెలసిన నల్లగొండమ్మతల్లి కొండ చుట్టూ కొన్నేళ్లుగా మాఘపౌర్ణమి రోజున భక్తులు గిరిప్రదక్షిణ చేయడం ఆనవాయితీ. ఈఏడాది కూడా భక్తులు అధిక సంఖ్యలో బుధవారం తెల్లవారుజామున తాండవలో నల్లగొండమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత తాండవ ఆడాకుల తాండవ స్పిల్‌వే గేట్లు, జాలారిపేట గ్రామం మీదుగా నాతవరం, గొలుగొండ కొయ్యూరు మండలాల పరిధిలో సుమారుగా ఏడు కిలోమీటర్ల మేర గిరి ప్రదక్షణ చేశారు. భక్తులకు తాగునీరు, మజ్జిగ ఉత్సవ కమిటీ సభ్యులు అందించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణం వద్ద అన్నదానం జరిపారు. గిరిప్రదక్షిణ అనంతరం ఆలయ ప్రాంగణం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

వాలాబులో పశువైద్యుల బృందం పర్యటన

దేవరాపల్లి: మండలంలోని వాలాబు గిరిజన పంచాయతీలో పశు సంవర్ధకశాఖ ఉన్నతాధికారుల బృందం బుధవారం పర్యటించింది. ఈ పంచాయతీలో గొర్రెలు, మేకల పెంపకం ఎంత మేర జరుగుతుందోనని జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి రామ్మోహన్‌రావు, డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్ తదితరులు ప్రాథమిక సర్వే చేశారు. గ్రామంలో గొర్రెలు, మేకల పెంపకదార్లతో మాట్లాడి వివరాలను సేకరించారు. జీవాల రోగ నిరోధక టీకాల కార్యక్రమం గురించి అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట ఎంపీడీవో ఎం.వి.సువర్ణరాజు, ఏపీవో ఎస్.ప్రభాకర్, స్థానిక పశువైద్యాధికారులు కె.మంజూషరాణి, జి. ప్రియాంక తదితర్లు పాల్గొన్నారు.



గొర్రెలు, మేకల పెంపకం ఆరా తీస్తున్న జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి రామ్మోహన్‌రావు

తహసీల్దార్ రమణయ్య భార్యకు ఉద్యోగం

రెవెన్యూ అసోసియేషన్ కృతజ్ఞతలు

మహారాణిపేట: తహసీల్దార్ ఎస్.రమణయ్య హత్యోదంతం విషాదకరమని, ఆయన కుటుంబాన్ని ఆదుకోవడానికి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ చేసిన కృషి ఎనలేనిదని ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.ఎ.త్రినాథ్, కార్యదర్శి సిహెచ్.వి.రమేష్ అన్నారు. జిల్లాలో దారుణ హత్యకు గురైన తహసీల్దార్ ఎస్.రమణయ్య భార్య పోలాకి అనూషకు కారుణ్య నియామకం ద్వారా ప్రొబేషనరీ డిప్యూటీ తహసీల్దారు ఉద్యోగం లభించింది. ఈ మేరకు రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, రాష్ట్ర సెక్రటరీ జనరల్ రామిశెట్టి వెంకట రాజేష్‌కు వీరు కృతజ్ఞతలు తెలిపారు. జీవనాధారం కోల్పోయిన వృద్ధులైన తల్లిదండ్రులు, ముక్కుపచ్చలారని ఐదేళ్ల లోపు ఇద్దరు పిల్లలు, భార్య ఆక్రందన ఉద్యోగుల హృదయాలను కలచి వేసిందన్నారు. రమణయ్య కుటుంబాన్ని ఆదుకోవడానికి శక్తివంచన లేకుండా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, జనరల్ సెక్రటరీ కృషి చేశారని, ఈ నియామకం ద్వారా ప్రతి రెవెన్యూ ఉద్యోగిలో ధైర్యాన్ని నింపారన్నారు. ఈ సహాయాన్ని ఎప్పటికీ మరువలేమని త్రినాథ్, రమేష్ అన్నారు.

వరికుప్పలు, ట్రాక్టర్ దగ్ధం

అచ్యుతాపురం : మండలంలోని జగ్గన్నపేటలో మూడు లక్షల రూపాయిల విలువైన రైతుల ఆస్తి బుగ్గిపాలయ్యింది.కేవలం విద్యుత్ శాఖకు చెందిన సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ఈ అగ్ని ప్రమాదం జరిగిందని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జగ్గన్నపేట పొలాలకు సమీపంలో బుధవారం ట్రాన్స్‌ఫార్మర్ త్రీ ఫేస్ లైన్‌లో ఎడ్జ్ ఫీజు వైర్ తెగి వరి కుప్పలపై పడిందని అక్కడి రైతులు పేర్కొన్నారు. దీంతో వరికుప్పలు, ట్రాక్టర్ కాలిపోయాయి. దీంతో తమకు తీరని నష్టం వాటిల్లిందని మళ్ల శ్రీనివాసరావు, దొడ్డి రమణ, మళ్ల ఆదినారాయణ, మళ్ల ఆదీశ్వరరావు వాపోయారు.

భార్య మరణించిందని..

అనకాపల్లి: భార్య మృతితో మనస్తాపం చెందిన ఎ.నాగేషు (62) బుధవారం తాకాశివీధిలోని తన ఇంటిలో ఆత్మహత్య చేసుకున్నట్లు పట్టణ ఎస్ఐ అల్లు వెంకటేశ్వరరావు చెప్పారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారని, వారికి గతంలో వివాహం చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పులపర్తి సర్పంచ్ రాజీనామా



ఎంపీడీవో కొండలరావుకు రాజీనామా లేఖ అందజేస్తున్న పులపర్తి సర్పంచ్ సుంకర కొండబాబు

యలమంచిలి రూరల్: మండలంలోని పులపర్తి సర్పంచ్ సుంకర కొండబాబు తన పదవికి రాజీనామా చేశారు. అనారోగ్య సమస్యల కారణంగా సర్పంచ్ విధులు నిర్వర్తించలేక పోతున్నానని పేర్కొంటూ ఆయన బుధవారం సాయంత్రం రాతపూర్వకంగా యలమంచిలి ఎంపీడీవోకు రాజీనామా లేఖను అందజేశారు. వృద్ధాప్యం, అనారోగ్య సమస్యలే రాజీనామాకు కారణంగా ఆయన తెలిపారు. నాలుగేళ్లుగా తనకు విధి నిర్వహణలో సహకరించిన అధికారులు, ఉద్యోగులకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.

కుంభమేళాకు ఆర్టీసీ బస్సు పయనం

డాబాగార్డెన్స్: ద్వారకా బస్ స్టేషన్ నుంచి కుంభమేళా(ప్రయోగరాజ్)కు ఏపీఎస్‌ఆర్టీసీ సర్వీస్ బుధవారం బయలుదేరి వెళ్లింది. జిల్లా ప్రజా రవాణాధికారి బి.అప్పలనాయుడు యాత్ర బస్సును ప్రారంభించారు. ఈ యాత్ర ఏడు రోజుల పాటు వివిధ పుణ్యక్షేత్రాల మీదుగా సాగనుందని తెలిపారు. కుంభమేళాకు ఈ నెల 16న మరో ట్రిప్ నడపనున్నట్టు పేర్కొన్నారు. టికెట్ ధర రూ.8 వేలుగా నిర్ణయించామన్నారు. ఆన్‌లైన్ లేదా సమీప బస్‌స్టేషన్‌లో టికెట్స్ పొందవచ్చని, మరిన్ని వివరాలకు 9052227083, 9959225602, 9959225594, 9100109731 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

గున్నెంపూడి, జడ్. జోగంపేట ఉపాధ్యాయులకు మెమోలు

బుచ్చెయ్యపేట, రావికమతం : బుచ్చెయ్యపేట, రావికమతం మండలాల్లో నలుగురు ఉపాధ్యాయులకు డీఈవో గిడ్డి అప్పారావు నాయుడు మెమోలు జారీ చేశారు. బుధవారం ఆయన బుచ్చెయ్యపేట మండలం గున్నెంపూడి జిల్లా పరిషత్ హైస్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అపరిశుభ్ర వాతావరణంలో విద్యార్థులకు భోజనాలు వండడంతో పాటు విద్యార్థులకు వండే భోజనం నాణ్యతగా లేకపోవడంతో డీఈవో ఆగ్రహం చెందారు. దీనిపై హెచ్‌ఎం నాగేశ్వరరావుకు మెమో జారీ చేశారు. పెదమదీన హైస్కూల్‌ను తనిఖీ చేసి విద్యార్థుల చదువులపై ప్రశ్నలు అడిగి సంతృప్తి వ్యక్తం చేశారు. రావికమతం మండలం జడ్.జోగంపేట మండల పరిషత్ స్కూల్‌ను తనిఖీ చేశారు. హెచ్‌ఎం సెలవులో ఉన్నట్టు గుర్తించారు. పలు సబ్జెక్ట్‌లపై విద్యార్థులను డీఈవో ప్రశ్నలు వేయగా విద్యార్థులు సరైన సమాధానాలు చెప్పలేదు. దీంతో పిల్లల చదువులపై ఉపాధ్యాయులు సరైన శ్రద్ధ చూపకపోవంపై హెచ్‌ఎం పార్వతి,ఉపాధ్యాయులు కె.వి.లక్ష్మి, పి. పద్మవల్లిలకు మెమోలు అందించారు. పాఠశాలలో విద్యార్థులకు గుణాత్మకమైన విద్య అందేలా,చదువులో మెలకువలు, విజయం సాధించడంపై విద్యార్థులకు డీఈవో అవగాహన కల్పించారు.

బావిలో పడి వ్యక్తి మృతి



మృతుడు శ్రీనివాసరావు

ఎస్.రాయవరం : మండల కేంద్రం ఎస్.రాయవరం గ్రామానికి చెందిన అరిగల శ్రీనివాసరావు (55) నేల బావిలో పడి మృతి చెందినట్టు ఎస్.రాయవరం పోలీసులు బుధవారం చెప్పారు. కొబ్బరి కాయల వ్యాపారం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న శ్రీనివాసరావు, కుమారుడు వీర వెంకట దుర్గాసాయి రాజేష్‌తో కలిసి పొలంపనికి వెళ్లారు. పని ముగించుకుని ఇంటికి వచ్చే సమయంలో శ్రీనివాసరావు ముఖం కడుక్కునేందుకు నేల బావి వద్దకు వెళ్లాడు. అప్పుడు కాలు జారి బావిలో పడిపోయాడు. ఇది గమనించి కుమారుడు కేకలు వేసి చుట్టుపక్కల వారిని పిలిచాడు. స్థానికులు వచ్చి బావిలో పడిపోయిన శ్రీనివాసరావుని బయటకు తీశారు. అయితే అతను అప్పటికే ప్రాణాలు వదిలినట్టు ఫిర్యాదులో పేర్కొన్నట్టు చెప్పారు. వివరాలు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

క్లుప్తంగా

ఘనంగా ఆరోగ్య మాత మహోత్సవాలు

అనకాపల్లి: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారిలో పునీత పొలుకతోలిక దేవాలయంలో ఆరోగ్య మాత మహోత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. దేవాలయంలో మేరీమాతకు దివ్య సత్ప్రసాద ఆరాధన, జపమాల, ఆరోగ్యమాత తేరుతో పుర ప్రదక్షిణ, మహోత్సవ కృతజ్ఞతా బలిపూజ తదితర కార్యక్రమాలను చర్చి ఫాదర్ ఎస్.శేఖర్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు పెతకంశెట్టి జోషఫ్, క్రైస్తవులు పాల్గొని మేరీ మాతకు ప్రార్థనలు చేశారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనకాపల్లి: విద్యుత్ శాఖ డీ–1 సెక్షన్ పరిధిలో విద్యుత్ వైర్ల మరమ్మతుల నిమిత్తం శుక్రవారం 11కేవీ లక్ష్మీనారాయణ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆ శాఖ ఈఈ కె.రాజశేఖర్, ఏఈ త్రినాథ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెరుగుబజార్ జంక్షన్, మసీదు వీధి, నెయ్యిల వీధి, కోట్నివీధి, గాంధీబొమ్మ జంక్షన్, చిన్నవీధి, రెల్లివీధి, తాకాశి వీధిలో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు విద్యుత్ శాఖ ఉద్యోగులకు సహకరించాలని ఆయన కోరారు.

బాడీ బిల్డింగ్ పోటీల్లో సంతోష్ ప్రతిభ



సంతోష్‌ను సత్కరిస్తున్నగంగాధర్

అనకాపల్లి: శ్రీకాకుళంలో ఈ నెల 9న జరిగిన రాష్ట్ర స్థాయి 30వ మిస్టర్ బాడీ బిల్డింగ్ ఛాంపియన్‌షిప్–2025 పోటీల్లో అనకాపల్లి అవినాష్ పవర్ జిమ్‌కు చెందిన పి.సంతోష్ ప్రతిభ కనబరిచాడు. 70 కేజీల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన ఆయనను బుధవారం జిమ్ వ్యవస్థాపకుడు ఐ.ఆర్.గంగాధర్ శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిమ్ మేనేజర్ గొర్లి స్వామిగౌడ్, క్రీడాకారులు బుద్ధ గణేష్, దొడ్డి వెంకటరావు, అయినాల కృష్ణ, డి.హేమంత్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి 'గాదె'కు మద్దతుగా ప్రచారం

కశింకోట: మండలంలోని వివిధ పాఠశాలల్లో ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ అభ్యర్థి గాదె శ్రీనివాసులు నాయుడు విజయాన్ని కాంక్షిస్తూ బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఆచంట రవి, ఉమ్మడి విశాఖ జిల్లా పూర్వపు అధ్యక్షుడు బుద్ధ విశ్వేశ్వరరావు, ఏపీయూఎస్ రాష్ట్ర నాయకుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్థానిక డీపీఎన్ జెడ్పీ హైస్కూలు, తేగాడలోని కేజీబీవీ, ఏపీ మోడల్ స్కూలు, తాళ్లపాలెంలోని గురుకుల పాఠశాలలను సందర్శించారు. ఈ నెల 27న జరిగే ఎన్నికలో శ్రీనివాసులునాయుడుకు మొదట ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని అభ్యర్థిస్తూ ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు ప్రసాద్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు బుధవారం 8,087 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,620	4,750
మొదటి రకం	3,490	4,180
రెండో రకం	3,160	3,690
మూడో రకం	2,890	3,150

అనకాపల్లి సినిమాలు

డాకు మహారాజ్	:రాజా
పుష్ప-2	:సత్యనారాయణ స్క్రీన్-1
ఒక పథకం ప్రకారం	:సత్యనారాయణ స్క్రీన్-2
తండేల్	:పర్తిసాయి
సంక్రాంతికి వస్తున్నాం	:షిర్డీసాయి
పట్టుదల	:వెంకటేశ్వర
గేమ్ ఛేంజర్	:శ్రీసత్య(ఉదయం, మొదటి షో)
మదగజ రాజ	:శ్రీసత్య(మేట్నీ, రెండో షో)
భవాని వార్డు	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 62 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5 యూనిట్లు, బీ పాజిటివ్-15 యూనిట్లు, ఓ పాజిటివ్-38 యూనిట్లు, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ య.లోకేష్‌ను ఫోన్ నంబర్ 97036 19706లో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 360 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 324 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 నంబరులో సంప్రదించవచ్చు.

ఓ విద్యార్థీ మేలుకో.!

- సత్ఫలితాలిస్తున్న వినూత్న కార్యక్రమం
- 'పది' విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ
- ఉత్తమ ఫలితాల సాధనకు ఉపాధ్యాయుల కృషి



వెదురుపర్తిలో విద్యార్థుల ఇళ్లకు వెళ్లి అనుమానాలు నివృత్తి చేస్తున్న హెచ్‌ఎం ఎ.వి.ఎస్.మూర్తి(ఫైల్)



తల్లిదండ్రులకు ప్రోగ్రెస్ కార్డులు అందించి, ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతుల అందజేస్తున్న హెచ్‌ఎం మూర్తి(ఫైల్)



విద్యార్థులకు డ్రైఫ్రూట్స్ అందజేస్తున్న ఉపాధ్యాయుడు

కశింకోట: ఈ ఏడాది పదో **తరగతిలో ఉత్తమ ఫలి**తాల సాధనకు ఉపాధ్యాయు**లు విశేష కృషి చేస్తు**న్నారు. 'విద్యార్థీ మేలుకో'అ**ంటూ పదో తరగతి** విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ **కనబరుస్తున్నారు.** ఉత్తమ ఫలితాల సాధన దిశగా అడుగులు వేస్తున్నారు. మండలంలోని వెదురుపర్తి హైస్కూల్‌లో విద్యార్థి మేలుకో కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది. విద్యార్థుల భవిష్యత్ కోసం, విజ్ఞానం పెంపొందించడానికి, ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా గతేడాది అక్టోబర్ 2న జాతిపిత మహాత్మాగాంధీ జయంతి రోజున విద్యార్థీ మేలుకో వినూత్న కార్యక్రమాన్ని అప్పటి గణిత ఉపాధ్యాయుడు, ఇప్పటి హెచ్‌ఎం ఎ.వి.ఎస్.మూర్తి ప్రారంభించారు. పదో తరగతి విద్యార్థుల ఇళ్లకు ఉపాధ్యాయులు ఉదయం 5 గంటలకు వెళ్లి నిద్ర లేపి చదువు తీరును పరిశీలిస్తున్నారు. అవసరమైన సూచనలు, సలహాలు ఇస్తున్నారు. పాఠ్యాంశాలలో అనుమానాలుంటే నివృత్తి చేస్తున్నారు. ఆరోగ్యం కోసం సొంత ఖర్చుతో డ్రైఫ్రూట్స్ అందిస్తున్నారు. ఇలా వారానికి **రెండు, మూడు రోజుల పాటు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారు. ప్రతి నెలలో నిర్వహించే పరీక్షల్లో వచ్చిన మార్కుల జాబితా(ప్రో గ్రెస్ కార్డులు) ఇళ్లకు తీసుకెళ్లి తల్లిదండ్రు**లకు అందజేసి విద్యార్థుల చదువు వాస్తవ పరిస్థితిని వివరించి వారిలో లోపాలను సరి చేయడమే కాకుండా ప్రతిభ చూపుతున్న విద్యార్థులకు బహుమతులు అందించారు. తల్లిదండ్రులతో సమావేశమవుతూ విద్యార్థుల చదువు పట్ల శ్రద్ధ వహించాలని సూచిస్తూ ప్రోత్సహించారు. తమ పిల్లల చదువు, భవిష్యత్, ఆరోగ్యం పట్ల ఉపాధ్యాయులు చూపుతున్న శ్రద్ధతో ఈ కార్యక్రమానికి తల్లిదండ్రుల నుంచి ప్రోత్సాహం లభించింది. సహ ఉపాధ్యాయులు బోయిన చిన్నారావు, వై.విజయకుమార్ కూడా ఈ కార్యక్రమానికి అండగా నిలిచారు. వారు కూడా ఇంటింటికీ వెళ్లి విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. దీంతో టెన్త్ పరీక్షల్లో తమ పిల్లలు మంచి ఫలితాలతో ఉత్తీర్ణత సాధించగలరని తల్లిదండ్రులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మాపై ఉపాధ్యాయుల శ్రద్ధ బాగుంది



విద్యార్థి మేలుకో కార్యక్రమం ద్వారా ఉపాధ్యాయులు వేకువజామున వచ్చి నిద్ర లేపుతున్నారు. తమ చదువు, భవిష్యత్ పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుండటం ఎంతో ఆనందంగా ఉంది. వారానికి రెండు, మూడు రోజులు ఇళ్లకు వేకువ జామున వచ్చి తమ చదువు తీరును పరిశీలించి అనుమానాలుంటే నివృత్తి చేస్తున్నారు. దీని వల్ల చదువుపై ఆసక్తి పెరిగింది. సమయాన్ని వృథా చేయకుండా చదువుపై ఏకాగ్రతతో దృష్టి సారిస్తున్నాం. ఇంతటి శ్రద్ధ కనబరుస్తున్న ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు.

– పాల దుర్గా ప్రసాద్, విద్యార్థి, వెదురుపర్తి

విద్యార్థుల్లో ప్రేరణ కలిగిస్తున్నాం..



విద్యార్థి మేలుకో కార్యక్రమాన్ని నాలుగు నెలల నుంచి నిర్వహిస్తున్నాం. ఇంటింటికీ ఉదయాన్నే వెళ్లి విద్యార్థులకు మార్గ దర్శకత్వం చేస్తూ ప్రేరణ కలిగిస్తున్నాం. టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించడానికి కృషి చేస్తున్నాం. విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపు, ఆరోగ్యాన్ని పరిరక్షణ, మంచి భవిష్యత్‌ను ఈ కార్యక్రమం ద్వారా అందించే ప్రయత్నం చేస్తున్నాం. ఇందుకు సహ ఉపాధ్యాయులు కూడా కూడా సహకరిస్తున్నారు.

– ఎ.వి.ఎస్.మూర్తి, హెచ్‌ఎం, వెదురుపర్తి హైస్కూలు

వైఎస్సార్‌సీపీ నాయకుల కుటుంబాలకు పరామర్శ



జి.భీమవరంలో మహాలక్ష్మినాయుడు చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న మలసాల భరత్‌కుమార్

కశింకోట: మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుల కుటుంబ సభ్యులకు ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ సంతాపం తెలిపారు. ఈ మేరకు బుధవారం మృతుల ఇళ్లకు వెళ్లి ఆయా కుటుంబ సభ్యులను పరామర్శించారు. జి.భీమవరం సర్పంచ్ హనుమంతు వెంకట్ తండ్రి మహాలక్ష్మినాయుడు, బుచ్చియ్యపేట గ్రామ మాజీ సర్పంచ్ చెల్లబోయిన మురళి సోదరుడు రాజు, పరవాడపాలెంలో వైఎస్సార్ సీపీ నాయకుడు భర్నికాన రమణ తల్లి ఇటీవల మృతి చెందారు. ఆయా గ్రామాల్లో జరిగిన పెద్దకర్మ కార్యక్రమాలకు భరత్‌కుమార్ హాజరై మృతుల చిత్ర పటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, పార్టీ యువ నాయకుడు మలసాల కుమార్‌రాజా, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

పెందుర్తి: పెందుర్తి ప్రాంతంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన 13 మందికి కోర్టు చెరో రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.1.30 లక్షలు జరిమానా విధించినట్లు స్థానిక ట్రాఫిక్ ఎస్‌ఐ నరసింగరాజు తెలిపారు. బుధవారం వీరందరినీ జిల్లా 2వ ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా జడ్జి పైవిధంగా తీర్పు ఇచ్చినట్లు పేర్కొన్నారు.

వెంకన్న ఆలయ నిర్మాణానికి విరాళాల వెల్లువ



విరాళం అందిస్తున్న వ్యాపారవేత్త యుగంధర్

మునగపాక: ప్రతి ఒక్కరూ వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆలయ కమిటీ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ కోరారు. మునగపాక బైపాస్ రోడ్డులో రూ.4 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న వేంకటేశ్వరస్వామి ఆలయానికి ప్రతి ఒక్కరూ చేయూతనందిస్తున్నా రు. దీనిలో భాగంగా విశాఖకు చెందిన వ్యాపారవేత్త ఐవీఎస్ యుగంధర్ రూ.2 లక్షలు, నాగులాపల్లికి చెందిన బొడ్డేడ పద్మకృష్ణ రూ.50 వేలు, మునగపాకకు చెందిన ఆడారి సన్యాసిరావు రూ.10వేలు, పెంటకోట సుగుణ రూ.10 వేలు, విశాఖకు చెందిన గవర నాగశేషు రూ.లక్ష, విశాఖకు చెందిన పెంటకోట నిర్మల రూ.2లక్షలు, అల్లిపురానికి చెందిన గ్రంధి రాజేష్ రూ.2లక్షలు, విశాఖకు చెందిన దాడి నారాయణరావు రూ.2లక్షల చొప్పున విరాళాలను ఆలయ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సూరిశెట్టి రాము, కాండ్రేగుల జగ్గారావు, పెంటకోట వెంకట్, పెంటకోట ఉమేష్, ఆడారి లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి



వెదురుపర్తి హైస్కూల్లో చేతుల పరిశుభ్రత గురించి వివరిస్తున్న హెచ్‌ఎం ఎ.వి.ఎస్.మూర్తి

కశింకోట: విద్యార్థులు పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని వెదురుపర్తి హైస్కూల్ హెచ్‌ఎం ఎ.వి.ఎస్.మూర్తి అన్నారు. మండలంలోని వెదురుపర్తి హైస్కూల్లో 'స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర'కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భోజనం, టిఫిన్ తినే ప్లేట్లను, చేతులను శుభ్రపరుచుకోవాలన్నారు. సైన్స్ ఉపాధ్యాయుడు పి.రమేష్ మాట్లాడుతూ చేతులు, ప్లేట్ల మీద కొన్ని మిలియన్ల క్రిములు దాగి ఉంటాయని, వాటిని తినే ముందు శుభ్రపరచుకోకపోతే అనారోగ్యానికి గురవుతామన్నారు.

కూరగాయల దిగుబడిపై దృష్టి సారించాలి



అక్కిరెడ్డిపాలెంలో క్షేత్ర స్థాయి పరిశీలన చేస్తున్న మండల వ్యవసాయ శాఖ అధికారి రంగాచారి

అనకాపల్లి: మండలంలో ఆకుకూరలు, కూరగాయల దిగుబడిపై రైతులు ప్రత్యేక దృష్టి సారించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి పి.రంగాచారి అన్నారు. అక్కిరెడ్డిపాలెం గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆయన కూరగాయల పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూరగాయల సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. పురుగు మందుల వాడకాన్ని తగ్గించాలని సూచించారు. రైతు సేవా కేంద్రం, సచివాలయం, స్థానిక గ్రామ వ్యవసాయ సహాయకుల వద్ద రైతులు తాము పండించిన ఆకుకూరలు, కూరగాయలను ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సాలాపు శాంతిసూరిఅప్పారావు, జిల్లా వనరుల కేంద్రం సహాయ సంచాలకుడు సుబ్రహ్మణ్యం, గ్రామ వ్యవసాయ సహాయకురాలు జ్యోత్స్న, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పట్టని ప్రభుత్వం



మున్సిపల్ కార్మికులతో సమస్యలపై చర్చిస్తున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏసుదాసు

యలమంచిలి రూరల్: ప్రజల ఆరోగ్యం కోసం నిరంతరం కష్టపడి పనిచేస్తున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలు రాష్ట్ర ప్రభుత్వానికి పట్టడం లేదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గనిశెట్టి ఏసుదాసు అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. గత ప్రభుత్వ హయాంలో కార్మికుల సమ్మె సమయంలో కార్మిక సంఘాల నాయకులతో జరిపిన చర్చలకు సంబంధించిన మినిట్స్‌లో అంశాలను అమలు చేయాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. గతేడాది సెప్టెంబరు మొదటి వారంలో విజయవాడలో వచ్చిన వరదల సమయంలో పనిచేసిన పారిశుధ్య కార్మికులకు ఇప్పటివరకు దుస్తులు, వేతనం ఇవ్వకపోవడం దారుణమన్నారు. మరణించిన, ఉద్యోగ విరమణ చేసిన కార్మికుల కుటుంబాలకు పని కల్పించాలన్నారు. పారిశుధ్య కార్మికులకు రక్షణ కోసం చేతి గ్లౌవ్స్, దుస్తులు, మాస్కులు, శానిటైజర్లు, సబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికుల సంఘం నాయకులు వై.నూకరాజు, సీహెచ్.వెంకటరమణ, ఎం.నాగరాజు, జె.వెంకటరమణ, ఇ.చంద్రరావు, డి.మహేష్, సీహెచ్.అన్నవరం పాల్గొన్నారు.

పూడిమడక జాతరకు ప్రత్యేక బస్సులు



జాతర సందర్భంగా ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన స్పెషల్ కౌంటర్

అనకాపల్లి టౌన్: మాఘ పౌర్ణమి సందర్భంగా జరిగే పూడిమాడక జాతర, సముద్రంలో స్నానమాచరించడానికి అధిక సంఖ్యలో భక్తులు బయలుదేరారు. పట్టణం, మండలం నుంచి అధిక సంఖ్యలో భక్తులు బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. కాంప్లెక్స్ వద్ద అధికారులు భక్తుల సౌకర్యార్థం టెంట్ ఏర్పాటు చేసి, భక్తులను దగ్గరుండి బస్సులను ఎక్కించారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు వెళ్లారు. పర్వదినం సందర్భంగా స్నానమాచరించి గంగాదేవికి పూజలు చేశారు.

వైభవం.. మాఘ పూర్ణిమ తీర్థ మహోత్సవం



తీరంలో పుణ్య స్నానాలు ఆచరిస్తున్న భక్తులు



బ్రహ్మకుమారీస్ శిబిరాన్ని ప్రారంభిస్తున్న సీఐ మల్లికార్జునరావు

పరవాడ: ముత్యాలమ్మపాలెం తీరంలో మాఘపౌర్ణమి తీర్థమహోత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొని, పుణ్య స్నానాలు ఆచరించారు. మాఘ పూర్ణిమ సందర్భంగా మంగళవారం రాత్రి నుంచే భక్తులు తీరానికి చేరుకుని, రాత్రంతా తీరంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి జాగరణ చేశారు. బుధవారం సూర్యోదయాన సముద్రంలో పుణ్య స్నానాలు ఆచరించి సమీపంలోని మాధవస్వామిని దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. స్నానం అనంతరం మహిళలు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేకంగా తాత్కాలిక గదులు ఏర్పాటు చేశారు. ప్రమాదాలు జరగకుండా గజ ఈతగాళ్లను నియమించారు. భక్తుల సౌకర్యార్థం వాడచీపురుపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో తీరంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. భక్తుల కోసం పలు స్వచ్ఛంద సంస్థలు తాగునీరు, మజ్జిగ, ఉచిత ప్రసాదాలు పంపిణీ చేశాయి. దూర ప్రాంతాల నుంచి పుణ్య స్నానాల కోసం వచ్చే భక్తుల కోసం కూర్మన్నపాలెం స్టీల్‌డిపో యాజమాన్యం 8 ఆర్టీసీ బస్సులను నడిపింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు ఆధ్వర్యంలో పరవాడ, సబ్బవరం పోలీస్ స్టేషన్‌ల నుంచి అదనపు పోలీసు బలగాలతో బందోబస్తు నిర్వహించారు. ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీ విశ్వవిద్యాలయం వాడచీపురుపల్లి వారి ఆధ్వర్యంలో తీరంలో ఏర్పాటు చేసిన శివ సందేశ కార్యక్రమాన్ని సీఐ మల్లికార్జునరావు ప్రారంభించారు. సోమేశ్వరి, ప్రభాకరమూర్తి, ఆదిలక్ష్మి, విజయలక్ష్మి, సత్యవతి పాల్గొని భక్తులకు శివ సందేశాలను బోధించారు.

ఘనంగా మహా మాఘి ఉత్సవాలు



గోపూజలో పాల్గొన్న భక్తులు

సబ్బవరం: దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి క్షేత్రంలో మహా మాఘి ఉత్సవాలను బుధవారం వైభవంగా నిర్వహించారు. శ్రీమేరులో కొలువైన ఖడ్గమాల దేవతల ప్రతిష్ఠాపన జరిగి నేటికి 31 ఏళ్లు పూర్తయినట్లు గురుమాత అన్నపూర్ణమ్మ తెలిపారు. ఉదయం గోపూజతో కార్యక్రమం ప్రారంభించారు. వేదమంత్రాల నడుమ 108 పవిత్ర కలశాలను శరణు ఘోషతో శ్రీమేరు, గణపతి ఆలయాల పురవీధుల గుండా ఊరేగింపుగా తీసుకొచ్చి ఖడ్గమాల దేవతల వద్ద ఒక్కొక్కటిగా ఉంచారు. 9వ అవరణ కేంద్ర బిందువులో ఉన్న సహస్రాక్షి అమ్మవారికి, అవరణలోని మిగిలిన దేవతలకు వేద మంత్రాలతో, కళావాహన, లలితా సహస్ర నామం, ఖడ్గమాల స్తోత్రాలతో పూజించారు. ప్రయాగరాజ్ మహా కుంభమేళా నుంచి తెచ్చిన పవిత్ర జలాలతో అభిషేకించారు. హైదరాబాద్‌కు చెందిన కొండూరి పద్మావతి శిష్య బృందం సౌందర్యలహరి పారాయణ ఆకట్టుకుంది.

టమాటా రైతు కన్నీరు.!

- రోజురోజుకూ పడిపోతున్న ధర
- పెట్టిన పెట్టుబడి కూడా రాలేదని ఆవేదన



అనకాపల్లి మార్కెట్‌లో కొనే వారు లేక దిగాలుగా కూర్చున్న టమాటా రైతు

అనకాపల్లి టౌన్: మొన్నటి వరకు ఆకాశాన్నంటిన టమాటా ధర ప్రస్తుతం రోజురోజుకూ పడిపోవడంతో రైతులు కన్నీరు పెడుతున్నారు. అనకాపల్లి మార్కెట్‌కు కశింకోట, అనకాపల్లి మండలాల్లోని విస్సన్న పేట, వల్లూరు, తదితర గ్రామాల నుంచి టమాటాలను తీసుకువస్తున్నారు. బుధవారం 30 కేజీల టమాటా కేటు రూ. 100 నుంచి రూ.120 **మాత్రమే ధర పలికింది. ఈ లెక్కన కేజీ టమాటా ధర 4 రూపాయలుగా ఉంది. రిటైల్‌గా రూ.10 నుంచి రూ.15 విక్రయిస్తున్నారు. టమాటా ధర రోజురోజుకు పతనమవడంతో సాగు చేసే రైతులు తీవ్ర** నష్టాలను చవి చూడాల్సి వస్తోంది. కష్టపడి పండించిన పంటకు కనీస ధర కూడా రావడం లేదు. ఎకరా పంటకు అన్ని ఖర్చులతో రూ.30 వేలు పెట్టుబడి అవుతుంది. ప్రస్తుతం పెట్టుబడిపై లాభం రాకపోగా పంటను అమ్మడానికి తిరిగి డబ్బులు పెట్టాల్సి వస్తుందని రైతులు చెబుతున్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి



ఎకరా పొలంలో టమాటా సాగు చేశాను. దిగుబడి బాగుంది. ధర పడి పోయింది. ప్రభుత్వమే గిట్టుబాటు ధర కల్పించి రైతుల దగ్గర నుంచి నేరుగా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలి.

– గోకాడి భవాని, తమ్మయ్యపేట

పెట్టుబడి కూడా రాలేదు..



రెండు ఎకరాలు కౌలుకు తీసుకొని టమాటా సాగు చేపట్టా. అప్పు చేసి పెట్టుబడి పెట్టా. దిగుబడి బాగున్నా మద్దతు ధర లేక పెట్టుబడి కూడా రావడం లేదు. పండిన పంటను దాచుకొని అమ్ముదామంటే కోల్డ్ స్టోరేజీ సదుపాయం లేదు. ప్రభుత్వమే ఆదుకోవాలి.

– చిమ్మా మహాలక్ష్మి, వల్లూరు

కిరాణా షాపుల్లో తనిఖీలు



జోగుంపేట కిరాణా షాపులను పరిశీలిస్తున్న తూనికలు, కొలతల అధికారి

గొలుగొండ : మండలంలో పలు కిరాణా షాపులను నర్సీపట్నం తూనికల కొలతల శాఖ అధికారి అనురాధ బుధవారం పరిశీలించారు. జోగుంపేట, గొలుగొండ, గుండుపాల, చీడిగుమ్మల తదితర గ్రామాల్లో వ్యాపారాలు నిర్వహిస్తున్న షాపులను పరిశీలించారు. కాటాను పరిశీలించి తునికలు తక్కువగా ఉన్న షాపులపై కేసులు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు. జోగుంపేట కిరాణా షాపుల్లో కొలతల్లో బియ్యం తక్కువగా ఉన్నట్టు గుర్తించామన్నారు. వినియోగదారులకు షాపుల యజమానులు నాసిరకం వస్తువులు అమ్మినా, తూనికల్లో తక్కువగా వచ్చినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.